


## రోడ్డెక్కిన డాక్టర్లు

కోల్ కత్తా ఘటనకు నిరసనగా ఐఎంఏ ర్యాలీ

నిందితులను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్

8లో..

వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 353 శనివారం | 17 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

# పర్సంటేజిలిస్తేనే పనులా..?

## ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపులేదా..



### మురుగునీటి నిలయంగా చిన్నబ్రిడ్జి
### సమస్య పరిష్కరించడంలో ఇంజినీర్ల దాటవేత
### పట్టించుకోని బల్దియా పాలకవర్గం
### ఏళ్లు గడుస్తున్నా తీరని వెతలు
### పాతబస్తీ అంటే చిన్నచూపంటూ ఆగ్రహం

అండర్ రైల్వే గేటు ప్రాంత వాసులు సిటీలోకి అడుగు పెట్టేందుకు ప్రధాన మార్గాల్లో ఒక్కటైన చిన్న బ్రిడ్జి బల్దియా ఇంజినీర్లకు సవాల్ గా మారిందా..? ఏళ్లు గడుస్తున్నా ఈ సమస్యను పరిష్కరించలేకపోతున్నారా..? నిత్యం ఈ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారినా పట్టించుకోరా..? పెద్ద పెద్ద సమస్యలను చిటికెలో పరిష్కరించే గ్రేటర్ ఇంజినీరింగ్ అధికారులు చిన్న బ్రిడ్జి సమస్యను మాత్రం గాలికి వదలడానికి కారణమేమిటి..? చిన్న పనికి పర్సంటేజీలు రావని పరిష్కార మార్గం చూపడంలేదా లేక పాతబస్తీ ప్రజలంటే అధికారులకు, పాలకవర్గానికి చిన్న చూపా..? గతంలో తాత్కాలిక పరిష్కారంగా అండర్ బ్రిడ్జి కింద నిలిచిన నీటిని'గల్వర్'తో ఏరోజుకారోజు తొలగించే వారు. దీంతో ఈ ప్రాంత వాసులకు కొంత ఊరట లభించేంది. తర్వాత ఏమైందో తెలియదు కాని వర్షాకాలం ప్రారంభమైనప్పటినుంచి మీ చావు మీరు చావండి అన్నట్లుగా గ్రేటర్ పాలకవర్గం, ఇంజినీర్లు వ్యవహరించడంపై స్థానికులు మండిపడుతున్నారు. బల్దియాలో చేయి తడుపందే పని జరుగదని చెప్పడానికి చిన్న బ్రిడ్జి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తక్కువ ఖర్చుతో శాశ్వత పరిష్కారం చూపే అవకాశం ఉన్నప్పటికీ దాంట్లో వారికేమీ మిగలదన్న ఉద్దేశంతోనే ఏళ్లు గడుస్తున్నా సమస్యకు పరిష్కారం చూపడంలేదన్న విమర్శలున్నాయి. ఈ విషయంలో అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమించచక తప్పదని హెచ్చరిస్తున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్



# నగరంలో సినీ నటి కీర్తి సురేష్ సందడి

జోస్ అలుక్కాస్ జ్యువలరీ మాల్ ప్రారంభం



8లో..



2లో..

# చేనేతకు చేయూత

- రాష్ట్రంలో ఐఐహెచ్‌టి కళాశాల
- 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు
- టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు

# చేనేతకు చేయూత



## రాష్ట్రంలో ఐఐహెచ్‌టి కళాశాల

### 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు

### టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో నూతనంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్ టి) కాళాశాల ఏర్పాటుకు కేంద్రం ద్వారా అనుమతులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. చేనేతకు చేయూత అందించాలన్న లక్ష్యంతో హైదరాబాదులో ఈ విద్యా సంవత్సరంలోనే శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో 60 సీట్లతో డిప్లమా కోర్సును ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. 2024-25 విద్యా సంవంత్సరంలో అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు. గతంలో హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సుల్లో చేరాలంటే తమిళనాడులోని సేలం, ఆంధ్రలోని వెంకటగిరి ప్రాంతాలకు వెళ్లే వారని, అక్కడ సీట్లు తక్కువ కాంపిటీషన్ ఎక్కువగా ఉన్నందున తెలంగాణ విద్యార్థులకు సీట్లు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. తెలంగాణలో కూడా ఇలాంటి ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలని గత పాలకులకు అనేక వినతులు అందజేసినా పెడచెవిన పెట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి సురేఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వరంగల్ లో కాకతీయ టెక్స్ టైల్ పార్కు అనుబంధంగా ఇక్కడ టెక్స్ టైల్ ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయడం ద్వారా శిక్షణ పొందిన చేనేత, పద్మశాలి యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయంటూ కోరగా ఆయన సానుకూలంగా స్పందించి కేంద్ర ప్రభుత్వం ద్వారా అనుమతులు తీసుకొచ్చి కళాశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. దేశంలో ఇలాంటి కాళాశాలలు 10 ఉంటే అందులో ఆరు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నాలుగు మాత్రం రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉన్నాయని చిప్ప వెంకటేశ్వర్లు గుర్తు చేశారు. ఐదవది తెలంగాణ రాష్ట్రానికి రావడం గర్వించదగ్గ విషయం అన్నారు.

చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు రాఘవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి టెక్స్ టైల్ ఓఎస్ డి వి.హిమాజా కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఇందులో చేరగోరే విద్యార్థులు పదవ తరగతి లేదా సమానమైన పరీక్షలలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 2024 జులై ఒకటవ తేదీ నాటికి బీసీ, జనరల్ కేటగిరి పిల్లల గరిష్ట వయోపరిమితి 23 సంవత్సరములు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల వారికి గరిష్ట వయోపరిమితి 25 సంవత్సరములుగా నిర్ధారించినట్లు తెలిపారు. దరఖాస్తులను ఈనెల 31వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. కోర్సు వ్యవధి మూడు సంవత్సరములు, ఆరు సెమిస్టర్లు అన్నారు. కోర్సులో చేరిన ప్రతి విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.2,500 స్టైఫండ్ చెల్లిస్తుందన్నారు. విద్యార్థి సంవత్సరానికి రూ.4,050 మాత్రమే ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. నాంపల్లిలోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం క్యాంపస్ కు సమీపంలోనే వసతి కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. అందుకు తగు ఖర్చులను విద్యార్థి తల్లిదండ్రులు భరించాల్సి ఉంటుందన్నారు. ఆ సందర్భంగా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు రాఘవరావు మాట్లాడుతూ పూర్తి చేసిన దరఖాస్తులు కమిషనర్ చేనేత, జౌళి శాఖ కార్యాలయం, చేనేత భవన్, మూడో అంతస్తు, నాంపల్లి, హైదరాబాద్ చిరునామాకు రిజిస్టర్ పోస్టు ద్వారా గాని సంబంధిత జిల్లా సహాయ సంచాలకులు చేనేత, జౌళి శాఖ వారి కార్యాలయం నందు గాని సమర్పించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డెవలప్ మెంట్ ఆఫీసర్లు బొట్టు వెంకటేశ్వర్లు, బిజ్జా వెంకటేశ్వర్లు, డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ఎలగం రవిరాజు, చేనేత సమాఖ్య అధ్యక్షుడు పంతగాని శ్రీనివాస్, మంత్రి లింగమూర్తి, సహకార సంఘాల అధ్యక్షులు ఎలగం పెద్ద భద్రయ్య, చిన్న భద్రయ్య, అడిగొప్పుల సంపత్, కూరపాటి సంపత్, పిట్టా రాములు, పరికిపండ్ల రమేష్, ఎలగం సాంబయ్య, మాచ బత్తుల కుమారస్వామి, శామంతుల శంకర లింగం, దానం రాజయ్య, లింగబత్తిని పురుషోత్తం, చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవగాహన సదస్సును విజయవంతం చేశారు.



# మళ్లీ మంచి రోజులు..

### వరంగల్ కార్పొరేటర్ల సమీక్షలో కేటీఆర్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కష్టపడి పని చేస్తే తిరిగి మంచి రోజులు వస్తాయని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో శనివారం గ్రేటర్ వరంగల్ బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ల సమీక్షా సమావేశాన్ని మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో గ్రేటర్ వరంగల్ డిప్యూటీ మేయర్ రిజ్వానా శమిమ్ మాసూద్, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, సిద్ధం రాజు, పార్టీ సీనియర్ నాయకుడు టి.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# గోమతి స్కూల్‌లో రక్షా బంధన్

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని గిర్మాజీపేట బొడ్రాయి సమీపంలోని గోమతి పబ్లిక్ స్కూల్ లో శనివారం ముందస్తు రక్షాబంధన్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కూచన క్రాంతి కుమార్ కుమార్ మాట్లాడుతూ అన్నా చెల్లెల్ల అనుబంధానికి, ప్రేమకు ప్రతీక ఈ రక్షాబంధన్ పండుగ అన్నారు. పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది. అనంతరం విద్యార్థినిలు, విద్యార్థులకు రక్షాబంధనం కట్టి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆడెపు హారతి, ఇంచార్జి కరుణ, ఉపాధ్యాయులు సంధ్య, ప్రగతి, శ్రీ విద్య, సంయుక్త, సృజన, విద్యార్థులు పాల్గొన్నారు.

### జనవరి 1, 2025 ప్రామాణికంగా..

# ఓటర్ జాబితా సవరణ

### రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**వరంగల్ వాయిస్, వరంగల్/ హనుమకొండ :** 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సీఈఓ కార్యాలయం నుంచి అదనపు సీఈఓ లోకేష్ కుమార్ తో కలిసి ఓటరు జాబితా సవరణ-2025పై అన్ని జిల్లాల కలెక్టర్లతో సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.ప్రావీణ్య, వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ జనవరి 1, 2025 ప్రామాణికంగా ఓటర్ జాబితా సవరణ-2025 కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో చోటు కల్పించేలా కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. జిల్లాలో ఓటరు జాబితా నమోదు ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు.

**జనవరి 6న తుది జాబితా..**

ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 28 వరకు ప్రీ రివిజన్ నిర్వహించి అక్టోబర్ 29న ముసాయదా ఓటరు జాబితా విడుదల చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సూచించారు. నవంబర్ 28 వరకు సదరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వికరించాలని, రెండు శనివారాలు, ఆదివారాలు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. డిసెంబర్ 24 లోగా అభ్యంతరాలను, ఓటర్ క్లెయిమ్స్ ను పూర్తి స్థాయిలో పరిష్కరించి, 6 జనవరి 2025 న తుది ఓటరు జాబితా రూపొందించాలన్నారు.

**ఇంటింటి సర్వే..**

ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18 వరకు బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వారిగా ఇంటింటికి తిరుగుతూ ఓటరు ధృవీకరణ చేపట్టాలని, ఓటరు జాబితాలో అవసరమైన ప్రాంతాల్లో పాత ఫొటోలను తొలగించి ఓటర్ల నూతన ఫొటోలు అప్ లోడ్ చేయాలన్నారు. అక్టోబర్ 19 నుంచి అక్టోబర్ 28 వరకు జనవరి ఒకటి 2025 ప్రామాణికంగా 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తూ ముసాయిదా జాబితాను రూపొందించాలన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న లాజికల్ పొరపాట్లు, డెమోగ్రాఫికల్ పొరపాట్లను పూర్తి స్థాయిలో సవరించాలని అధికారులను ఆదేశించారు. మరణించిన ఓటర్ల వివరాలు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను ఓటర్ జాబితా నుంచి ఫారం-7 ద్వారా తొలగించాలన్నారు. 1500 మంది ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేయాలని, అవసరమైన చోట నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఓటర్ జాబితాలో ఉన్న మల్టీ ఎంట్రీలను తొలగించాలని, అదేవిధంగా ఓటర్ కార్డుపై ఉన్న పొరపాట్లు పరిష్కరించాలని కలెక్టర్ లకు ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న 79,822 ఫారం-8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సీఈఓ ఆదేశించారు.

**నియోజకవర్గాల్లో ప్రత్యేక కార్యక్రమాలు..**


ఓటరు నమోదుకు సంబంధించి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం వారిగా ప్రత్యేక కార్యక్రమాలు రుపొందించి అమలు చేయాలని సీఈఓ సుదర్శన్ రెడ్డి సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమానికి సంబంధించి జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్ లో హనుమకొండనుంచి అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారులు వెంకటేశ్వర్లు, నారాయణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొనగా, వరంగల్ జిల్లానుంచి రెవెన్యూ డివిజన్ అధికారి కృష్ణవేణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# రైతు రుణ మాఫీ దేశానికి ఆదర్శం

## కాంగ్రెస్ నేత రాపోల్ ఆనంద్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రైతు రుణ మాఫీ మార్గదర్శి రాహుల్ గాంధీ అని కాంగ్రెస్ నేత రాపోలు ఆనంద్ భాస్కర్ కొనియాడారు. ఆచరణ సాధ్యమయ్యే వాగ్దానమే చేయాలన్నది కాంగ్రెస్ స్వీయ క్రమశిక్షణ అని తెలిపారు. దేశంలోనే రాహుల్ గాంధీ న్యాయ సూత్రాలు అట్టడుగు వారికి అందని తరుణంలో తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.17 వేల కోట్ల భారంతో చెప్పినట్టే ఆగస్టు15 నాటికి 22 లక్షల మందికి చేయూత ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా, రైతు పక్షపాతి ప్రభుత్వమన్నారు. నిరుపేదలకు, రైతులకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఆరు గ్యారెంటీల అమలును చాలా పట్టుదలగా తీసుకుందని పేర్కొన్నారు. దశలవారీగా ఆరు గ్యారెంటీల అమలును చేస్తుందని, ఈ క్రమంలో కొంత ఆర్థిక భారం పడ్డప్పటికీ దాన్ని సర్దుబాటు చేసుకుంటూ ముందుకు సాగుతుందని రాపోలు ఆనంద్ భాస్కర్ తెలిపారు.

# 'రక్షా బంధన్'తో దేశానికి రక్ష




**వరంగల్ వాయిస్, మరిపెడ :** నీవు నాకు రక్ష.. నేను నీకు రక్ష.. మనిద్దరం దేశానికి రక్ష అంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరిపెడలో విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలసి రక్షాబంధన్ వేడుకల్లో ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సంధర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతరావు మాట్లాడుతూ రక్షాబంధన్ ఆత్మీయ, అనురాగాలకు ప్రతీక అని, ఒకరికొకరు రక్షగా ఉండి, అందరు కలసి ఈ దేశానికి రక్షగా నిలబడాలని, పాఠశాలలో ఈ విధమైన వేడుకలు జరుపడం వల్ల విద్యార్థుల మధ్య సోదరభావం పెంపొంది తద్వారా విశ్వ మానవ సౌభ్రాతృత్వం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రామ్మోహన్ బయగాని, ఉపాధ్యాయ బృందం నందిగామ జనార్ధనా చారి, దేవుల, నెహ్రూ, స్వప్న, ప్రకాష్, శౌరి, రమేష్ రెడ్డి,లెనిన్, ప్రసాదరావు, సారయ్య, జహెదా బేగం, సురేష్, బాబురావు, రాజకుమారి, మంజుశ్రీ, పద్మ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థలలో ఉచిత విద్యను అందించాలి

## బహుజన స్టూడెంట్స్ జిల్లా అధ్యక్షుడు మంద సురేష్



**వరంగల్ వాయిస్, పరకాల :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్నటువంటి జర్నలిస్ట్ పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థలలో ఉచిత విద్యను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బహుజన స్టూడెంట్స్ యూనియన్(బీఎస్ యూ) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద సురేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం జర్నలిస్టులకు అనేకమైన హామీలు ఇచ్చి నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. ఈ ప్రభుత్వమైనా ఇచ్చిన హామీలను అమలు పర్చాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధులుగా ఉండేవారే జర్నలిస్టులని,నిరంతరం ప్రజా సమస్యల పైన పత్రిక రూపకంగా వాళ్ళ కష్టాలు బాధలు తెలుకొని మన ప్రజల కోసం ప్రభుత్వాలు ఇచ్చే హామీల రాత రూపకంగా రాసే జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేశారు. లక్షల లో ఫీజులు తీసుకోవడం సరైన పద్ధతి కాదని అధికారులను కోరారు. రాబోయే రోజులలో వీళ్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చి వారికి వారి కుటుంబానికి న్యాయం చేకూర్చాలని ప్రధానంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కమ్యూనిస్టులే దేశానికి ప్రత్యామ్నాయం

## ములుగు జిల్లా అభివృద్ధికి నిధులను ప్రభుత్వం కేటాయించాలి

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, ములుగు :** కమ్యూనిస్టులే దేశానికి సరైన ప్రత్యామ్నాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. బుధవారం ములుగు జిల్లా కమిటీ సమావేశం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జంపాల రవీందర్ అధ్యక్షత వహించారు, దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామపక్షాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కులం, మతం పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూసే పార్టీలకు కాలం చెల్లిందన్నారు. లౌకిక దేశమైన భారత దేశంలో ఎన్నటికైనా మత రాజకీయాలు, మతోన్మాద శక్తులు అంతరించిపోక తప్పదని అన్నారు. కేంద్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేందుకే పని చేసిందని, పేదలు, మధ్య తరగతి వర్గాల ప్రజల సమస్యలను పట్టించుకోలేదని అన్నారు. దళితుల, గిరిజనుల, మైనారిటీలపై బీజేపీ హయాంలో దాడులు పెరిగాయని, చివరకు రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలను కూడా ధ్వంసం చేశారన్నారు. పార్లమెంటు ఎన్నికలలో బీజేపీని మెజారిటీ ప్రజలు వ్యతిరేకించారని, అయినా మోడీ వైఖరిలో మార్పు రాలేదన్నారు. కమ్యూనిస్టులు, లౌకిక శక్తులతోనే ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణ సాధ్యమని అన్నారు. రానున్న రోజులలో పార్టీ బలోపేతానికి సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు కృషి చేయాలని కోరారు. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత, వెనుకబడిన ములుగు జిల్లా నిర్లక్ష్యానికి గురైంది, మరిన్ని నిధులు కేటాయించాలని జిల్లా అభివృద్ధి చేయులని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే గిరిజన విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించి భారీగా నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆగస్ట్ 22, 23, 24 తేదీలలో హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ లో సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డీ.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె. నారాయణ, మాజీ ఎంపీ అజీజ్ పాషా హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై, దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల విజయవంతానికి కృషి చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున్ రావు, సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, జిల్లా సమితి సభ్యులు ఆచంట ప్రసాద్, ఎండీ. అంజాద్ పాష, ముత్యాల రాజు, బండి నర్సయ్య, ఇంజం కొమురయ్య, వడి సారయ్య, జక్కుల అయిలయ్య, మాతంగి శ్యాంసుందర్, కునుకు ముత్తయ్య, కట్ల రాజు, ఎన్. రవి, కుమ్మరి సాగర్, కొక్కుల రాజేందర్, గార రాంబాబు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ బంద్ సంపూర్ణం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** బంగ్లాదేశ్ లో హిందువులు , హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సంపూర్ణంగా జరిగింది. పట్టణంలోని వాణిజ్య వ్యాపార విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. హిందూ ఐక్య వేదిక శ్రేణులు ప్రధాన వీధులలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి బంద్ పాటించని వ్యాపారులతో మాట్లాడి షాప్ లను మూయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందో బస్తును ఏర్పాటు చేశారు. పట్టణంలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరుగుతోంది. ఆర్టీసీ బస్సులు యధావిధిగా నడిచాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్, వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.



# విద్యార్థులను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దండి

## జిల్లా సెక్టోరియల్ అధికారి కుడికాల సుభాష్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని హైస్కూల్ చెన్నారావుపేట, ప్రాధమిక పాఠశాల కోనాపురాలను జిల్లా సెక్టోరియల్ అధికారి కె.సుభాష్ శనివారం సందర్శించడం జరిగింది. నేడు అన్ని పాఠశాలలో పేరెంట్ టీచర్ మీటింగ్ జరుగుతుంది. జిల్లా సెక్టోరియల్ అధికారి పాఠశాలలో జరుగుతున్న పేరెంట్ టీచర్ మీటింగ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా సెక్టోరియల్ అధికారి మాట్లాడుతూ విద్యార్థులను బాధ్యత గల పౌరులు గా తీర్చిదిద్దండని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. అలాగే, ఈ పేరెంట్ టీచర్ మీటింగ్ కు తల్లిదండ్రులు విధిగా అత్యధిక సంఖ్యలో హాజరు కావాలని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి, వారిని బాధ్యత గల పౌరులు గా తీర్చిదిద్దాలని తెలిపారు. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మనుపాటి పాపమ్మ, ప్రధానోపాధ్యాయులు ముత్తినేని శ్రీనివాస్, ఉపాధ్యాయులు కిషోర్, రవి, ఉమాదేవి, రజిని, అనుపమ, శ్రీనివాస రెడ్డి, కౌషీర్, ఆంజనేయులు, అజాం, సుష్మ, సీఆర్పీలు సంపత్, స్వామి, వీఓ ఏ.మమత పాల్గొన్నారు.

# వైద్యా శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహాను కలిసిన రాజేష్ ఖన్నా

## మంత్రికి వినతి పత్రం అందజేత



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులకు సంబంధించి 510జీవోను సవరించి 4000 వేల మంది ఉద్యోగులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్ హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా కోరారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర నర్సింహాను శనివారం మర్యాద పూర్వకంగా కలిసి ఆయన ఉద్యోగులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని మణిపూర్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలలో రెగ్యులరైజ్ చేసిన తరహాలో ఆయా రాష్ట్రాల జీవోలను బట్టి 510 జీవోను సవరించి 4000 మందికి వెంటనే వేతన సవరణ చేసి క్యాడర్ ఫిక్స్ చేసి, మహిళ ఉద్యోగులు వేతనంతో కూడిన 180 రోజులు మెటర్నిటీ సెలవులు వెంటనే ప్రకటించాలని కోరారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలని, 60 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి రిటైర్ మెంట్ ప్రకటించి రూ. 25,000 పెన్షన్ ప్రకటించాలని, తెలంగాణ రాష్ట్రంలో ఎన్ హెచ్ ఎం పరిధిలో విధులు నిర్వహిస్తున్న నాలుగు వేల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఆయా రాష్ట్రాలలో రెగ్యులరైజ్ చేసిన కాపీలను ఆయన మంత్రికి అందజేశారు. ఈ విషయమై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే 4000 వేల కుటుంబాలలో వెలుగులు నింపేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతి ఒక్కరికి ఒక క్యాడర్ ఫిక్స్ చేసి క్యాడర్ కొత్త వేతనం ఇచ్చే విధంగా నూతన కమిటీకి శ్రీకారం చుడుతామని మంత్రి తెలిపారన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఉత్తర్వుల ప్రకారం త్వరలోనే సమాన పనికి సమాన వేతనాన్ని ఇస్తామన్నారు. ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కు, కొంత సమయం పడుతుందని మంత్రి వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత మురళీ మోహన్, ఆయూష్ డిపార్ట్ మెంట్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనవాస్, ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సరికొండ సురేష్ గౌడ్, రాష్ట్ర నాయకులు శ్రీమణి, వి.లోకేష్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

# వైద్యురాలిపై హత్యాచార ఘటన హేయం



## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వైద్యురాలిపై హత్యాచార ఘటన హేయమైన చర్య అని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కొలకత్తా లోని ఆర్ జీ కార్ వైద్య కళాశాల, ఆస్పత్రి జూనియర్ వైద్యురాలి ఘటనపై మడికొండ చౌరస్తాలో రాస్తారోకో చేసి, నిరసన తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న వైద్యుల నిరసనలు, దీక్షలకు మద్దతు ప్రకటించారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కొలకత్తా లోని ఆర్ జీ కార్ వైద్య కళాశాల, ఆస్పత్రి జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన బాధాకరమని దాస్యం వినయ్ భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ప్రజలను కాపాడే గొప్ప వృత్తి... వైద్య వృత్తి అని, వైద్యులను దేవుళ్లుగా కొలిచే సంస్కృతి సమాజం మనదన్నారు. వైద్యులపై దాడులు సమాజానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. హత్యాచార నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది కి మద్దతు తెలిపారు. కొలకత్తా డాక్టర్ కి జరిగిన ఘటన పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని హితవు పలికారు. వైద్యులకు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలని, వైద్యులపై దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించే చట్టాలు తేవాలని, జూనియర్ వైద్యురాలి హత్యాచార నిందితులను వెంటనే శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్లు రాధికా రెడ్డి, బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సంకు నర్సింగ్, సోదా కిరణ్, రాజు నాయక్, మాజీ కార్పొరేటర్లు నార్లగిరి రమేష్, జోరిక రమేష్, నాయకులు పులి రజినీకాంత్, నరేడ్ల శ్రీధర్, రఘు, గబ్బెట శ్రీనివాస్, బుద్దె వెంకన్న, రమేష్, రామ్మూర్తి, గండు అశోక్ యాదవ్, విద్యార్థి నాయకులు వీరస్వామి, రాకేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దుండగులను కఠినంగా శిక్షించాలి

### తాటిపాములు వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కోల్ కత్తాలో మహిళా డాక్టర్ పై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాములు వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈ పైశాచిక ఘటనపై దేశవ్యాప్తంగా జరుగుతున్న వైద్య విద్యార్థులు, డాక్టర్లు, సిబ్బంది చేస్తున్న ఆందోళనలకు బీకేఎంయూ సంపూర్ణ మద్దతును తెలుపుతున్నదన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు పూర్తయిన నేటికీ మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, హత్యలు ఆగడం లేదన్నారు. ఒక మహిళ అర్ధరాత్రి పూట ఒంటరిగా బయలుదేరి క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చినప్పుడే నిజమైన స్వతంత్రమని ఆనాడు మహాత్మా గాంధీ చెప్పారని కానీ, ఈనాడు పట్టపగలే మహిళలకు రక్షణ లేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ముఖ్యంగా మహిళల మాన ప్రాణాలకు రక్షణ లేని దౌర్భాగ్య పరిస్థితి రావడం నాగరిక సమాజం సిగ్గుతో తల దించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. యావన్మంది ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఈ పైశాచిక దుర్మార్గ చర్యలను తీవ్రంగా ఖండించాలన్నారు. ప్రభుత్వం తక్షణమే సమగ్రమైన న్యాయ విచారణ జరిపి ఇంతటి నీచమైన దుచ్చర్యలకు పాల్పడిన మానవ మృగాలను కఠినాతి కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. డాక్టర్లకు, వైద్య సిబ్బందికి అన్ని విధాల రక్షణ ఏర్పాట్లు చేయాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మహబూబాబాద్‌లో..



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కోలకత్తాలోని ఆర్ జీ కార్ వైద్య కళాశాల ఆసుపత్రి జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనను నిరసిస్తూ శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు, జూనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు నిలిపివేసి ప్లకార్డులు ప్రదర్శించి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నెహ్రూనాయక్ మాట్లాడుతూ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులలో వైద్యులకు ఉద్యోగ భద్రతతో పాటు రక్షణ చర్యలు చేపట్టి వైద్య సిబ్బంది కోసం ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని కోరారు. వైద్యురాలిపై జరిగిన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ర్యాలీలో డాక్టర్ నెహ్రూ నాయక్, మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, ఐఎంఏ వైద్యులు డాక్టర్ నెహ్రూ నాయక్, ఐఎంఏ జిల్లా అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## హత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి



**వరంగల్ వాయిస్, మహదేవపూర్ :** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్ కత్తా ఆర్ జి కార్ మెడికల్ కళాశాలలో డాక్టర్ గా విధులు నిర్వహిస్తున్న మౌమిత డెబనాథ్ (31) పై కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 8న చేసిన సామూహిక అత్యాచారం, హత్య ఘటనను జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం తీవ్రంగా ఖండించింది. దోషులను కఠినంగా శిక్షించాలని ముక్తకంఠంతో నినదించింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం నాడు మహాదేవపూర్ ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ సేవలను నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గంట చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య డాక్టర్లు, సిబ్బందిపై జరుగుతున్న దాడులను ఖండించారు. డాక్టర్ మౌమితపై జరిగిన దాడిలో దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. డ్యూటీ డాక్టర్ విద్యావతి మాట్లాడుతూ వైద్యులపై, ఉద్యోగులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. హెడ్ నర్సింగ్ ఆఫీసర్ వినయకుమారి మాట్లాడుతూ ఆసుపత్రులలో మహిళలకు, ఉద్యోగులకు రక్షణ కల్పించాలన్నారు. ఆసుపత్రి వైద్య ఆరోగ్య ఉద్యోగుల ప్రతినిధిగా ఐసీటీసీ కౌన్సిలర్ గాదె రమేష్ మాట్లాడుతూ డాక్టర్ మౌమితపై జరిగిన దాడిని తీవ్రంగా పరిగణించారు. దోషులను కఠినంగా శిక్షించాలని లేకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఆసుపత్రి నుంచి శ్రీపాద రావు చౌక్ వరకు ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేత బూని, ముక్తకంఠంతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్సింగ్ ఆఫీసర్ బాలమణి, నర్సింగ్ ఆఫీసర్లు, సిస్టర్లు, ఆస్పత్రిలో సేవలు అందిస్తున్న వివిధ విభాగాలకు చెందిన కాంట్రాక్టర్లు, లేబరేటరీ టెక్నీషియన్లు, పారామెడికల్ సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది, సానిటేషన్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాటారంలో వైద్య సిబ్బంది నిరసన..




**వరంగల్ వాయిస్, కాటారం :** పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్ కత్తా ఆర్ జి కార్ మెడికల్ కాలేజీ విద్యార్థిని డాక్టర్ మౌమిత డెబాణాత్ (31) పై ఈనెల 8న కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులచే సామూహిక అత్యాచారం, హత్యకాండకు నిరసిస్తూ శనివారం కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిరసన తెలియజేసింది. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మౌనిక, డాక్టర్ ప్రియాంక, డాక్టర్లు ఇతర సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి ప్ల కార్డులతో నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

## మౌమిత మృతికి హోమియో డాక్టర్ల సంఘీభావం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కలకత్తాలో ఇటీవల ఆర్ జీ కార్ వైద్య కళాశాలలో చదువుతున్న వైద్య విద్యార్థిని డాక్టర్ మౌమితపై జరిగిన పాశవిక అత్యాచారం, హత్య ఘటనను ఖండిస్తూ హోమియోపతి డాక్టర్లు నిరసన వ్యక్తం చేశారు. ఓరుగల్లు హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ (ఓహెచ్ఎంఏ) ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ (ఐఐహెచ్ పీ) ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలో జరిగిన సమావేశంలో హోమియో డాక్టర్ల అందరూ నిరసన తెలుపుతూ సంఘీభావంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, మరొకసారి ఇటువంటి ఘటనలు ఎదురు కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఓరుగల్లు హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్ రావు, అధ్యక్షుడు డాక్టర్ భీమగాని లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నామసాని రాంబాబు, ఉపాధ్యక్షులు డాక్టర్ రేవతి, డాక్టర్ కమల కిషోర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఐఐహెచ్ పీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పావుశెట్టి శ్రీధర్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ బి.పవన్ కుమార్, ఈసీ మెంబర్, డాక్టర్ గీతాలక్ష్మి, డాక్టర్ సాయి కృష్ణ, డాక్టర్ లక్ష్మణ్ రావు, డాక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

## వైద్యురాలి ఘటనపై ఏబీవీపీ నిరసన




**వరంగల్ వాయిస్, ములుగు రోడ్డు :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో పెద్దమ్మ గడ్డ హనుమాన్ జంక్షన్ లో నిరసన కార్యక్రమం తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కన్వీనర్ సుజిత్ పాల్గొని మాట్లాడుతూ వెస్ట్ బెంగాల్ మెడికల్ విద్యార్థిని పై జరిగిన అత్యాచారానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. వెస్ట్ బెంగాల్ లో మహిళలపై జరుగుతున్నటువంటి అత్యాచారాలను ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వెస్ట్ బెంగాల్ మహిళా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వారికి ఏమాత్రం రాజ్యాంగం పట్ల చిత్తశుద్ధి ఉన్న వెంటనే వారి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దోషులను బహిరంగంగా ఉరితీయాలని, లేకుంటే ఏబీవీపీ దేశవ్యాప్తంగా తీవ్రంగా ఉద్యమిస్తుందని వెస్ట్ బెంగాల్ ప్రభుత్వాన్నిహెచ్చరించారు.

## కేఎంసీలో నిరసన ర్యాలీ..




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 9న కోల్‌కతాలోని ఓ గవర్నమెంట్? మెడికల్? కాలేజీలో డ్యూటీలో ఉన్న మహిళ డాక్టర్?ను అర్ధరాత్రి కొందరు దుండగులు ఆమెను రేప్? చేసి హత్య చేసిన ఘటనను నిరసిస్తూ శనివారం వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ ఆవరణలో ఉన్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొని ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ, ఆపద సమయంలో ప్రాణాలను కాపాడే వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఇలాంటి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని పాల్గొన్న వారందరు ఏక కంఠంతో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ దీపక్ రెడ్డి, కార్డియాలజిస్ట్ డాక్టర్ రామ్ రెడ్డి హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజేష్ కుటుంబానికి అండగా ఉంటా

## పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** అమెరికాలో ఆత్మకూరుకు చెందిన ఏరుకొండ రాజేష్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి గురైన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి వెంటనే స్పందించి రాజేష్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి కార్యాలయంతో ఫోన్ లో మాట్లాడారు. హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరుకు చెందిన ఏరుకొండ రాజేష్ ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లి మూడు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే రాజేష్ కుటుంబ సభ్యులతో ఫోన్ లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. రాజేష్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు తాను అన్ని విధాలుగా కృషి చేస్తానని, మనోధైర్యం కోల్పోకుండా ఉండాలని వారి కుటుంబ సభ్యులకు సూచించారు. అనంతరం వెంటనే హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ముఖ్యమంత్రి కార్యాలయంతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఫోన్‌లో మాట్లాడి రాజేష్ మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరితగతిన తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు. అలాగే, తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి రాజేష్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా కృషి చేస్తానన్నారు. ఉన్నత చదువులు, మంచి ఉద్యోగాల కోసం అమెరికాకు వెళ్లిన రాజేష్ విగత జీవిగా తిరిగి రావడం బాధాకరమని, వారి కుటుంబంలో తీరని విషాదం నెలకొందని, కాంగ్రెస్ ప్రభుత్వం వారి కుటుంబానికి అండగా ఉంటుందని రేవూరి తెలిపారు.

# మృతుల కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, తల్లి కుడికాల సరోజన మృతి సందర్భంగా ఆయనను మాజీ ఎమ్మెల్యే తక్కలపల్లి రాజేశ్వరరావు శనివారం పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవి ధంగా భాజాపా సీనియర్ నాయకులు తాటికాయల నరసయ్య కుమార్తె అకాల మృతి సందర్భంగా పార్టీ మండల శ్రేణులు నర్సయ్యను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మృతికి గల కారణాలు తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పట్టాపురం ఏకాంతం, పాయిలి యాకన్న, గొల్లపల్లి సంతోష్ కుమార్, బత్తిని జలంధర్, బత్తిని దేవేందర్, చీమల చంద్రయ్య, భిక్షపతి, రంగు కుమార్, నవీన్, వీరస్వామి, సుధాకర్, వీరభద్రయ్య, తదితరులు కలరు.

# వరంగల్ జిల్లా స్పోర్ట్స్ కన్వీనర్‌గా గడదాసు మణికంఠ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కొత్తగా జరిగిన బీజేపీ యువమోర్చా కార్యవర్గంలో మార్షల్ ఆర్ట్స్ కోచ్ మణికంఠకు వరంగల్ జిల్లా స్పోర్ట్స్ కన్వీనర్ గా బాధ్యత దక్కిందని వరంగల్ జిల్లా బీజేపీ యూత్ ప్రెసిడెంట్ ఎర్రగొల్ల భరత్ వీర్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ తనకు ఈ పదవి దక్కడం ద్వారా వరంగల్ జిల్లాలోని స్పోర్ట్స్ అండ్ గేమ్స్, క్రీడాకారుల అభివృద్ధిలో తోడ్పడుతానని పేర్కొన్నారు. తనకు ఈ బాధ్యత ఇచ్చినందుకు వరంగల్ జిల్లా బీజేవైఎం ప్రెసిడెంట్ భరత్, బీజేపీ జిల్లా ప్రెసిడెంట్ గంట రవికుమార్‌కు, సహకరించిన జిల్లా నాయకులకు ప్రతి ఒక్కరికి మణికంఠ కృతజ్ఞతలు తెలిపారు.

# ఆదర్శలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



**వరంగల్ వాయిస్, కాటారం :** మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్లో శనివారం ముందస్తుగా రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రాఖీ వేడుకల్లో ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు మాట్లాడుతూ అన్నా చెల్లెలు, అక్క తమ్ముళ్లు ఆత్మీయతకు ప్రతీక రాఖీ పండుగ, తమకు రక్షణగా ఉండాలన్నారు. అంతకుముందు రాఖీ శుభాకాంక్షలు తెలియజేసి రాఖీ ముఖ్య ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ కృషిత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థిని హత్యాచారంపై సమగ్ర విచారణ జరపాలి

## పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కలకత్తా రాష్ట్రంలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్యచేసిన ఘటనపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తిచే సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు కేంద్ర ప్రభుత్వాన్ని, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పీడీఎస్ యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలకత్తాలోని ఆర్జీకార్ హాస్పిటల్ లో ట్రైనీ వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ జేఎన్ టీయూహెచ్ కళాశాల నుంచి ఆర్టీఓ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేయటం జరిగింది. ఈ సందర్భంగా బి.నరసింహారావు మాట్లాడుతూ 78 సంవత్సరాల స్వాతంత్ర భారత దేశంలో ప్రభుత్వాలు నేటికి విద్యార్థినిలకు, మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో మద్యం, డ్రగ్స్, అశ్లీల చిత్రాలు, బూత్ సాహిత్యాలను పూర్తిస్థాయిలో అరికట్టకుండా దిశా, నిర్భయ లాంటి చట్టాలెన్ని తెచ్చిన ఉపయోగం ఏమిటని పాలకులను ప్రశ్నించారు. తక్షణమే పాలకులు స్పందించి అర్జీ కార్ ఘటనకు కారకులైన దుండగులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి, కఠినంగా శిక్షించాలని, వైద్య విద్యార్థిని కుటుంబాన్ని అక్కడి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. ఆఫీసులో, ఇతర అన్ని ప్రదేశాలలో పనిచేస్తున్న మహిళలకు పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షుడు బొట్ల గౌతం, మహబాద్ పట్టణ కార్యదర్శి ఎం.సుహిత, జిల్లా నాయకులు ఎం.శృతి, బి.గణేష్, ఎం.శృతి, పి.రామచంద్రన్, బి.సాయికుమార్, ఓ.దేవేందర్ టి.మల్లికార్జున్, నితిన్, బి.జస్వంత్, జె.రామ్ లాల్, ఏ.అభిలాష్, జి.శ్రీనివాస్, బి.లక్ష్మణ్, పీడీఎస్ యూ మాజీ జిల్లా అధ్యక్షుడు పైన యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ సర్వసభ్య సమావేశం కాకతీయ యూనివర్సిటీ లో శనివారం జరిగింది. సంస్థ నూతన కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. సంస్థ జీవితకాల ఫౌండర్ చైర్మన్ గా బహుమతి సిరాజుద్దీన్, ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ గా ఆచార్య సురేష్ లాల్, జనరల్ సెక్రటరీగా శ్రీపాద సుధాకర్ రావు తిరిగి సభ్యులు ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రెటరీ-1 గా సిద్దోజ విద్యాసాగర్, జాయింట్ సెక్రెటరీ-2 గా జేపీ రామచంద్ర మూర్తి, కోశాధికారిగా పొడిశెట్టి విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులుగా పొన్నాల రామోహన్, కాజీపేట పురుషోత్తం ఎన్నిక కాగా, సంస్థ పీఆర్వోగా సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ కు తిరిగి బాధ్యతలు అప్పగించారు. అడ్వైజరీ బోర్డు సభ్యులుగా ప్రముఖ కవి డాక్టర్ అంపశయ్య నవీన్, గంటా రామ్ రెడ్డి, ప్రొఫెసర్ నరసింహమూర్తి, ప్రొఫెసర్ విజయబాబు, వాగ్దేవి విద్యాసంస్థల అధిపతి దేవేందర్ రెడ్డి, డాక్టర్ అనిత రెడ్డిలు వ్యవహరిస్తారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా గట్టు మహేష్ బాబు, శనిగరపు రాజమోహన్, షాద్మాని, డాక్టర్ బి.వీరేందర్, పొన్నాల సంయుక్త, సాగంటి మంజుల వాణి రాణి, ప్రకాష్ లను ఎన్నుకున్నారు. వీరితో పాటు ఐదు విదేశాలకు ఫారిన్ కంట్రీ కోఆర్డినేషన్ ను నియమించారు. ఈ కార్యవర్గం రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని సంస్థ పీఆర్వో శ్రీనివాస్ తెలిపారు. సమావేశ అనంతరం పశ్చిమబెంగాల్ కలకత్తా నగరంలో అత్యాచారానికి గురై హత్య భావించబడిన పీజీ వైద్య విద్యార్థికి నివాళి అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# డివిజన్ అభివృద్ధే ధ్యేయం

## కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** డివిజన్ లోని ఎల్లమ్మ గుడి తాళ్ల మండవ వద్ద కొత్తగా నిర్మించుకుంటున్న ఇంటి యజమానులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు తాను వరంగల్ మహానగరపాలక సంస్థ మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళతానని కాలనీ ప్రజలకు 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. ఎల్లమ్మ గుడి తాళ్ల మండవ వద్ద నివసిస్తున్న ప్రజలకు మంచినీరు, విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీలు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని, రాత్రి వేళలో చీకటిగా ఉండటం వలన బయటకి రాలేకపోతున్నామని, డ్రైనేజీ నీరు అంతా ఇండ్లలోకి వస్తుందని, కనీసం నడవడానికి వీలు లేకుండా ఉందని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని ఎల్లమ్మ గుడి తాళ్ల మండువ ప్రజలు కార్పొరేటర్ మరుపల్ల రవికి వినతి పత్రం ఇవ్వగా నూతనంగా వెలుస్తున్న కాలనీలు అభివృద్ధి చేయడమే నా ధ్యేయమని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి ప్రజలు కూడా సహకరించాలని కార్పొరేటర్ మరుపల్ల రవి ఆ కాలనీ వాసులను కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆవుల శ్రీకాంత్, బసవరాజ్ శివ, వనమాల రాధాకృష్ణ, కుంట హరీష్, అడుప నాగరాజు, మెంతుల శంకర్, ఆకుతోట శ్రీకాంత్, తౌటు కిషన్, రవి, ఆవుల శ్రవణ్ లు ఉన్నారు.

# ఘనంగా రక్షా బంధన్ వేడుకలు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరినొకరు రాఖీలు కట్టించుకొని, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇంచార్జి హెచ్ఎం రాగి శశిధర్ మాట్లాడుతూ విద్యార్థులకు రాఖీపండుగ విశిష్టతను వివరించారు. అన్నదమ్ముళ్లు, అక్కాచెల్లెల్లు ఒకరినొకరు రక్షగా ఉండేందుకు, విద్యార్థుల మధ్య సోదర భావం పెంపొందించేందుకు, సమైక్యత కొరకు రక్షాబంధన్ నిర్వహిస్తారన్నారు. ధర్మ జాగరణ సమితి సభ్యులు సంగెం శంకర్, విజయ్ రెడ్డి, కరుణాకర్, మల్లేశం తదితరులు రక్షలు తెచ్చి విద్యార్థులకు ఉపాధ్యాయులకు కట్టించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ చింతకింది సుజాత, పేరెంట్స్ కమిటీ సభ్యులు ,ఉపాధ్యాయులు సంతోష్ కుమార్ ,పిన్నింటి బాలాజీ రావు, సీహెచ్ మాధవి, మొగిలి, జి.సుందర్, కె.మాధవి, వర్దెల్లి సతీష్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్న, రమాదేవి, క్రాఫ్ట్ టీచర్ చింతకింది ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతి బాపూలే విద్యాలయాన్ని తనిఖీ చేసిన జడ్జి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా పరిధిలోని ప్రభుత్వ నిధులచే నడుస్తున్న అన్ని గురుకులాలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్ల తెలంగాణ రాష్ట్ర హైకోర్టు హైదరాబాద్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహబూబాబాద్ సందర్శించాలని ఆదేశాల జారీ చేశారు. అక్కడ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి తగు చర్య నిమిత్తం రిపోర్టును సంబంధిత శాఖల అధికారులకు, జిల్లా కలెక్టర్ కు పంపించడంతో పాటు తెలంగాణ రాష్ట్ర హైకోర్టుకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తికి సమర్పించాలని సూచించారు. కాబట్టి, అధికారులందరూ పిల్లలకు అందుతున్న సౌకర్యాలు, ఆరోగ్య విషయాలు, భద్రతపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. పై ఆదేశాల్లో భాగంగా నేడు మహబూబాద్ కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి జిల్లాకేంద్రంలోని పత్తిపాక రోడ్డులో గల బాలుర జ్యోతిబాపూలే విద్యాలయాన్ని సందర్శించి అక్కడ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి వంట గదితో పాటు స్టోర్ రూమ్, పిల్లల బాత్రూంలు స్వయంగా పరిశీలించి అక్కడ ఉన్న అపరిశుభ్రత, ఇతర విషయాల గురించి సంబంధిత ప్రిన్సిపల్, ఉపాధ్యాయులుకు తగు సలహాలు ఇవ్వడం జరిగింది. తిరిగి మళ్లీ వారం పది రోజుల్లో హాస్టల్ సందర్శించినప్పుడు ఇప్పుడు చూసినటువంటి లోపాలన్నింటిని సరిదిద్దవాల్సిందిగా ఆదేశించారు. ప్రతినెల జిల్లా పరిధిలోని మొత్తం అన్ని రకాల వసతి గృహాలను సందర్శించి అక్కడున్న వసతులపై తగు చర్యల నిమిత్తం అధికారులకు పంపడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్శనలో భాగంగా పిల్లలకు చట్టాలపైన అవగాహన కల్పించడం జరిగింది. చిన్న పిల్లల చేత మారకద్రవ్యాలను అక్రమరవాణా చేయించడం, వాటికి అలవాటు చేయడం వలన పిల్లలు ఆరోగ్యాలను నాశనం అవుతున్నాయని చెప్పారు. ఇంకా పోలీసు వారి చేతికి యువత చిక్కి భావి జీవితాలను ఆగం చేసుకుంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జితో పాటు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి నాగేశ్వరరావు, న్యాయవాదులు మహేందర్, బాలాజీ, కళాశాల ప్రిన్సిపల్ రాజేష్, వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

### బొనగాని యాదగిరి గౌడ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ బహుజన ఆత్మ గౌరవానికి, ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను రాష్ట్రంలోని గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ ఒక ప్రకటన లో పిలుపునిచ్చారు. ఆగస్ట్ 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి రోజుని సెలువు దినంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని యాదగిరి గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే పాపన్న గౌడ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాలలో లిఖించాలని కోరారు. ఆగస్ట్ 18 ఆదివారం రోజున రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా నిర్వహించే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలకు అన్ని జిల్లాలలో గౌడ కులస్తులు, బహుజనులు, మేధావులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారగోని కుమారస్వామి గౌడ్, రాష్ట్ర కార్యదర్శి చింత రమేష్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద వెంకన్న గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దూలం రాజేందర్ గౌడ్, దూలం పరమేష్ గౌడ్, కోటగిరి శ్రీనివాస్ గౌడ్, తిరుపతిగౌడ్, బుర్ర శ్యామ్ గౌడ్ పాల్గొన్నారు.

## సార్వత్రిక విద్య ఎంతో సులభమైంది



**వరంగల్ వాయిస్, పరకాల :** ఓపెన్ స్కూల్ ప్రాధాన్యతపై అవగాహనలో భాగంగా శనివారం ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్, బ్రోచర్ ను ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్ రావుతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందరికి విద్యను అందించాలనే దృక్పథంతో మధ్యలో చదువు మానేసిన వారందరు, వారి విద్యార్హతలు పెంపొందించుకొనుటకు, సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలు,వివిధ వృత్తి పనుల వారు తమకు ఇష్టమైన సబ్జెక్టులను ఎంపిక చేసుకొని ఆదివారాలు, సెలవు దినాలలో ముఖా ముఖి తరగతులకు హాజరై కోర్సు పూర్తి చేయవచ్చని అన్నారు. ఓపెన్ టెన్త్,ఇంటర్లలో ప్రవేశాలు పొందగోరే అభ్యర్థులు అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లను సంప్రదించి వారి సూచనల మేరకు ఆన్ లైన్ లో సంబంధిత రుసుం చెల్లించి ప్రవేశాలు పొందాలన్నారు. ప్రవేశాలకు సెప్టెంబర్ 10 చివరి తేదీ అని, దూర విద్యా విధానంలో తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ కోర్సులను, డ్రాపౌట్ విద్యార్థులు అందరు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా లోకానికి కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

### జిల్లా కాంగ్రెస్ నేత సాయిలి ప్రభాకర్ డిమాండ్



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం ఎంతో ఉపయోగంగా ఉంటే ఓర్వలేని కేటీఆర్ ఉచిత బస్సు ప్రయాణంలో మహిళలు బ్రేక్ డాన్సులు రికార్డింగ్ డాన్స్ లు చేసుకోవచ్చని వ్యంగ్యంగా మహిళలపై సంస్కారం లేకుండా మాట్లాడినందుకు ముక్కు నేలకు రాసి యావత్ మహిళలోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని సాయిలి ప్రభాకర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఆడబిడ్డలను గౌరవిస్తూ సంక్షేమ పథకాలను తీసుకొస్తే ఓర్వలేని కేటీఆర్ మహిళ లోకానికి మచ్చ తెచ్చారని విమర్శించారు. మహిళలను చులకనగా మాట్లాడే ముందు మన కుటుంబంలో కూడా మహిళలు ఈ రాష్ట్రంలోనే ఉన్నారని గుర్తు చేశారు. రుణమాఫీ సాధ్యం కాదు చేస్తే రాజీనామా చేస్తానన్న హరీష్ రావు తక్షణమే ఏ మాత్రం నైతిక విలువలు ఉంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం తెలుసు సంక్షేమ పథకాలను మాట ఇచ్చిన ప్రకారంగా అమలు చేయడం తెలుసు, కాంగ్రెస్ పార్టీకి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉందని తెలుసుకోవాలని హెచ్చరించారు. కేటీఆర్, హరీష్ రావు అధికారం కోల్పోగానే మతిభ్రమించినట్టు మాట్లాడడం సరైంది కాదన్నారు. మరోసారి మీరుమాటలు జారితే రాష్ట్రంలో మిమ్మల్ని ఎక్కడ తిరగనివ్వమని హెచ్చరించారు.

## స్వయం ఉపాధితో మహిళలకు ఆర్థిక భరోసా



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నేటి రోజుల్లో మహిళలు ఆర్థికంగా బలపడడానికి ఉద్యోగాలకు ఎదురు చూడకుండా చిన్న తరహా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని తమ జీవనం కొనసాగించాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఉర్సు సుభాష్ నగర్ రోడ్డులో జ్యోతి టైలరింగ్ షాపును మరుపల్ల రవి శనివారం ప్రారంభించారు. ఎక్కువ లాభాలు ఆశించకుండా తక్కువ రేటుతో నేటి కాలానికి అనుగుణంగా అనేక డ్రెస్సులు కుట్టితే చాలామంది డ్రెస్సులు కుట్టించుకుంటారని తెలిపారు. దీనివల్ల యజమానితో పాటు వర్కర్లకు జీవనోపాధి చేకూరుతుందన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు ప్రభుత్వం కల్పిస్తున్న రుణ సదుపాయాలు అందించుటకు బ్యాంక్ అధికారులు సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. టైలరింగ్ షాప్ ప్రారంభ కార్యక్రమంలో యజమాని బొజ్జ జ్యోతి, ఆర్పీ పసునూటి సంధ్య, మంద ప్రమీల, బొజ్జ సుధాకర్, మంద కుమార్ స్వామి, కరుణ, రేణుక ఉన్నారు.

## జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైన అలకనంద రాథోడ్



**వరంగల్ వాయిస్, మల్హర్ :** భరత నాట్యంలో గౌతమి నంది అవార్డు అందుకున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం అన్సాన్ పల్లి గ్రామానికి చెందిన నృత్య కళాకారిణి బేబి బానోత్ అలకనంద రాథోడ్ ఇటీవల ఆర్యాని సకల కళా వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి నృత్య కళా పోటీలలో అందరినీ ఆకట్టుకుని జాతీయ స్థాయి నాట్య సౌగంధిక పురస్కారానికి ఎంపికైంది. సెప్టెంబర్ 8న కరీంనగర్ ఫిలిం భవన్ లో జరిగే జాతీయ స్థాయి అవార్డుల ప్రధాన కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. అలక నంద రాథోడ్ కి జాతీయ స్థాయి అవార్డు రావడం పట్ల అలకనంద తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఆనందం వ్యక్తం చేశారు.

## చుంచు స్వాతికి డాక్టరేట్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హైదరాబాద్ చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో వాణిజ్యం, వ్యాపార నిర్వహణ విభాగంలో పీహెచ్ డీ చదువుతున్న హనుమకొండ నగరానికి చెందిన చుంచు స్వప్న పర్ఫామెన్స్ ఎనాలసిస్ ఆఫ్ కమర్షియల్ బ్యాంక్ ఇన్ ఇండియా ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ బ్యాంక్స్ అనే అంశంపై పరిశోధన చేయగా ప్రొఫెసర్ డాక్టర్ బి.రజిని పర్యవేక్షణలో డాక్టరేట్ పొందారు. డాక్టరేట్ పొందిన చుంచు స్వాతిని యూనివర్సిటీ కులపతి డాక్టర్ సీహెచ్ వి.పురుషోత్తం రెడ్డి అభినందించి డాక్టరేట్ ను అందించారు.


## ఆర్టీసీ మహిళా ప్రయాణికులకు బహుమతుల ప్రధానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆర్టీసీ డీలక్స్ బస్సులలో ప్రయాణించిన మహిళా ప్రయాణికులకు లక్కీ డ్రా ద్వారా బహుమతులను అందజేస్తున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. శనివారం హనుమకొండ బస్టాండ్ లో డీలక్స్ బస్సుల మహిళా ప్రయాణికుల లక్కీ డ్రా కార్యక్రమాన్ని హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరం సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఎం పాల్గొని డ్రా తీసి విజేతలను ప్రకటించి మాట్లాడుతూ డీలక్స్ బస్సులలో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికులకు ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ గిఫ్ట్ స్కీం ద్వారా బహుమతులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీని మరింతగా ఆదరించి సురక్షితంగా ప్రయాణించాలని ఆయన కోరారు. లక్కీ డ్రా ద్వారా ముగ్గురు డీలక్స్ మహిళా ప్రయాణికులను ఎంపిక చేశారు. హనుమకొండ బస్టాండ్ ఏఎంటీ ఏ.స్వామి, హనుమకొండ డిపో మెకానికల్ సూపర్వైజర్ వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు. బహుమతులను కాసం పుల్లయ్య క్లాత్ స్టోర్స్ వారు అందజేస్తున్నట్లు వారు తెలిపారు.

# ఆ తరహా సినిమాలు చేయాలనేదే నా కోరిక..

పక్కింటి కుర్రాడిలా కనిపించే నాని అష్టా చమ్మా చిత్రంతో హీరోగా పరిచయమయ్యాడు. ఆ తరువాత, ఈగ చిత్రంతో ఏకంగా దర్శకధీరుడు రాజమౌళి చిత్రంలో నటించే ఛాన్స్‌ను కొట్టేశాడు. ఆ తరువాత నానికి వెనుతిరిగి చూసుకోవాల్సిన అవసరం లేదు. ఎవడే సుబ్రమణ్యం, భీమిలి కబడ్డి జట్టు, అలా మొదలైంది, పిల్లా జమీందార్, భలే భలే మగాడివోయ్,జెర్సీ, నేనులోకల్, ఎమ్‌సీఎ, నిన్నుకోరి, శ్యామ్ సింగరాయ్, దసరా వంటి విజయాలను తన ఖాతాలో వేసుకున్నాడు.ఆయన ప్రస్తుతం వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో సరిపోదా శనివారం చిత్రంలో నటిస్తున్నాడు.. ఈ నెలలోనే ఆ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే నేచురల్‌స్టార్‌గా పక్కింటి కుర్రాడిగా కనిపించే నానికి లవ్‌స్టోరీస్, ఫ్యామిలీఎంటర్‌టైనర్ చిత్రాలే ఇప్పటి వరకు హిట్స్‌ను తీసుకొచ్చాయి. అయితే నానికి మాత్రం తను మాస్ హీరోగా మాస్ ఎంటర్‌టైనర్ సినిమాలు చేయాలని కోరిక. అందుకే ఆ తరహా సినిమాలు వీ, దసరా, శ్యామ్ సింగరాయ్ చిత్రాలను చేసి తన కోరిక తీర్చుకున్నాడు. అయితే ఆ చిత్రాలు నానికి అంతగా సంతృప్తి నివ్వలేదు. అందుకే సరిపోదా శనివారం తరువాత వరుసగా మూడు మాస్ సినిమాల్లో నాని కనిపించబోతున్నాడు. ప్రస్తుతం హిట్ 2 చిత్రంలో అర్జున్ సర్కార్‌గా కనిపిస్తున్న నాని త్వరలో మరో రెండు చిత్రాల్లో మాస్ అవతార్‌లో కనిపించబోతున్నాడు. దసరా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న నాని ఆ తరువాత సుజిత్ దర్శకత్వంలో ఓ సినిమా చేయడానికి అంగీకరించాడు. ప్రస్తుతం సుజిత్ పవన్‌కళ్యాన్‌తో ఓజీ అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమా తరువాత నానితో చేయబోయే సినిమా వుంటుంది. అయితే ఈ చిత్రంలో నాని ఫెరోషియాస్, యాంగ్రిమెన్‌గా ఫుల్ మాస్ హీరోగా కనిపించబోతున్నాడట. ఈ విషయాన్ని నానినే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలియజేశాడు. అంతేకాదు తనను ఇలా ఓ మాస్ హీరోగా చూడాలన్న తన అభిమానుల కోరిక కూడా ఈ సినిమాతో తీరబోతుందని అంటున్నాడు నాని.









# వారిని మనమే చెడగొడుతున్నాము

## థియేటర్లకు రాకుండా చేస్తున్నాం

## దిల్‌రాజు ఆసక్తికర వ్యాఖ్యలు

ప్రేక్షకులు థియేటర్స్‌కు రాకుండా మేమే చెడగొట్టామని ప్రముఖ నిర్మాత దిల్‌రాజు అన్నారు. నాలుగు వారాలకే సినిమాను ఓటీటీలోకి తీసుకురావడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని వ్యాఖ్యానించారు. ఎప్పటి కప్పుడు పరిశ్రమలోని పరిస్థితులను అంచనా వేస్తూ, అందుకు తగినట్లు సినిమాలు నిర్మించే వారిలో దిల్‌రాజు ఒకరు. తాజాగా ఓటీటీలపై ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్‌టాపిక్ అయ్యాయి. 'రేవు' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కొత్తవాళ్లతో సినిమాలు తీసే పక్రియ ఇండస్ట్రీలో ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. కానీ, 99శాతం ఫెయిల్ అవుతాయి. ఒకశాతం మాత్రమే సక్సెస్ రేట్. కెరీర్ తొలినాళ్లలో నేను సినిమాలు తీసేటప్పుడు నా సినిమాకు ఆడియన్స్ ఎలా వస్తారు? ఇంకా ఏమేం యాడ్ చేయాలి? అనుకుంటూ తీసేవాడిని. సినిమా తీయడం ఈ రోజుల్లో గొప్ప కాదు. ప్రేక్షకుడు థియేటర్‌కు వచ్చి ఆ మూవీని చూడటమే బిగ్ ఛాలెంజ్. మేము తీసిన 'బలగం', 'కమిటీ కుర్రోళ్ళు' నెమ్మదిగా మౌత్ టాక్ ద్వారా ప్రేక్షకులకు చేరాయి. అదే సమయంలో సినిమా బాగుందని రివ్యూలు ఇవ్వడం కూడా  ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. అసలు ప్రేక్షకులను చెడగొట్టింది మేమేలెండీ.. 'మీరు ఇంట్లో కూర్చోండి. నాలుగు వారాల్లో ఓటీటీకి తెస్తాం' అని థియేటర్‌కు రాకుండా చేసుకున్నాం. ఈ సినిమా (రేవు) చూసి నేను కూడా రివ్యూ ఇస్తా (నవ్వులు). మంచి సినిమా.. అదీ చిన్న మూవీ అయితే, ఇండస్ట్రీలోని ప్రతి ఒక్కరూ సహకారం అందించాలి' అని దిల్‌రాజు అన్నారు. ప్రస్తుతం దిల్‌రాజు వ్యాఖ్యలపై అటు ఇండస్ట్రీతో పాటు, ఇటు సామాజిక మాధ్యమాల వేదికగానూ చర్చ జరుగుతోంది. కరోనా తర్వాత వందల చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సందడి చేశాయి. థియేట్రికల్ రన్ బాగున్న సినిమాలు కూడా ముందుగానే స్ట్రీమింగ్‌కు వచ్చేశాయి. సినిమా విడుదలకు ముందే ఓటీటీ సంస్థలతో చిత్ర బృందాలు చేసుకున్న ఒప్పందాల కారణంగా రాక తప్పని పరిస్థితి. 'సలార్', 'టిల్లు స్క్వేర్', 'ది ఫ్యామిలీ స్టార్' వంటి చిత్రాలన్నీ జయాపజయాలతో సంబంధం లేకుండా త్వరగా ఓటీటీ బాటపట్టాయి. ఈ ఏడాది 'హనుమాన్', 'కల్కి 2898 ఏడీ'లు మాత్రం ఓటీటీలోకి వచ్చేందుకు కనీసం 50 రోజులు ఆగాయి. మరోవైపు ప్రేక్షకుడు థియేటర్‌కు వచ్చి సినిమా చూసే పరిస్థితులు నానాటికీ తగ్గిపోతున్నాయి. ఇందుకు చాలా కారణాలు ఉన్నాయి. టికెట్ ధరలు, పార్కింగ్ వసూళ్లు, తినుబండారాల ధరలు వెరసి నలుగురున్న కుటుంబ సినిమా చూడాలంటే తక్కువలో తక్కువ రూ.2వేలు ఖర్చు చేయాల్సిందే. వీటిని నియంత్రిస్తే, ప్రేక్షకుడు కచ్చితంగా థియేటర్‌కు వస్తాడన్నది సామాన్యుడి మాట.  కనీసం 50రోజులు పూర్తయిన తర్వాతే ఓటీటీలో వచ్చేలా ఒప్పందం చేసకుంటున్నాయి. తాజాగా తమిళ చిత్ర నిర్మాతల మండలి కూడా కీలక నిర్ణయం తీసుకుంది. అగ్ర కథానాయకులకు సంబంధించిన ఏ సినిమా అయినా విడుదలైన తేదీ నుంచి 8 వారాల తర్వాతే ఓటీటీలో విడుదల చేయాలని నిర్ణయించింది. మలయాళంలోనూ ఇలాంటి చర్యలకు శ్రీకారం చుట్టారు.

## 14 ఏళ్ల తరవాత ..



ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ వేదికగా జరుగుతోన్న 'ది ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్'కు గౌరవ అతిథిగా రామ్‌చరణ్ హాజరయ్యారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమకు చేసిన సేవలకుగాను 'ఆర్ట్ అండ్ కల్చర్ బ్రాండ్ అంబాసిడర్'గా అంతర్జాతీయ వేదికపై అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఆరెంజ్' రోజులను గుర్తుచేసుకున్నారు. 14 ఏళ్ల క్రితం 'ఆరెంజ్' సినిమా కోసం ఆస్ట్రేలియాలోని ఈ ప్రదేశానికి వచ్చాను. అది నా మూడో చిత్రం. 30 రోజులు చిత్రీకరణ ఇక్కడే జరిగింది. షూటింగ్ పూర్తయి భారత్‌కు వెళ్లే సమయంలో భావోద్వేగానికి గురయ్యాను. ఇక్కడి ప్రజల ప్రేమను, ఆ రోజులను ఎప్పటికీ మర్చిపోలేను. అప్పటి కంటే ఇప్పుడు ఎక్కువ మంది ఇండియన్స్ ఇక్కడ కనిపిస్తున్నారు. నా హోం టౌన్‌కు వచ్చినట్లు అనిపిస్తోంది. మీ అందరినీ చూస్తుంటే ఆనందంగా ఉంది. భారతీయ చిత్రపరిశ్రమ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం సంతోషంగా ఉంది. మీ అందరి వల్లే ఇది సాధ్యమైంది. ఈ ఈవెంట్ ఎప్పటికీ ప్రత్యేకమే' అని చెప్పారు. ఆస్ట్రేలియాలో మన జాతీయ జెండాను ఎగురవేసిన రామ్ చరణ్.. అక్కడ అభిమానులతో కలిసి ఫొటోలు దిగారు. వాళ్లతో కలిసి సరదాగా సమయాన్ని గడిపారు.

## 22 నుంచి ఓటిటిలోకి  కల్కి



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'  బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్నారు. తాజాగా దీనికి సంబంధించి అధికారికంగా ఓ ప్రకటన వెలువడింది. ఆగస్టు 22 నుంచి దీని హిందీ వెర్షన్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానుంది. ఇక ఇదే తేదీ నుంచి తెలుగు, తమిళంతో సహా మిగతా భాషల్లోనూ అమెజాన్ ప్రైమ్ వేదికగా అందుబాటులోకి రానుంది.

వరంగల్ వాయిస్ Evening Daily
శనివారం 17, ఆగస్టు 2024
www.warangalvoice.net




# రోడ్డెక్కిన డాక్టర్లు

## కొల్ కత్తా ఘటనకు నిరసనగా ఐఎంఏ ర్యాలీ

## నిందితులను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కొల్ కత్తా మహానగరంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సేవలందిస్తున్న మహిళా జూనియర్ డాక్టర్ పై పాశవిక దాడి, హత్య ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం వరంగల్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంజీఎం నుంచి కేఎంసీ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ దర్యాప్తును వేగిరం చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వెంటనే దేశవ్యాప్తంగా ఉన్న ఆస్పత్రుల్లో సరైన బందోబస్తును ఏర్పాటు చేయాలని, ఇటువంటి దాడులను అరికట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు డాక్టర్ బందెల మోహన్ రావు, డాక్టర్ పిల్లి సాంబశివరావు, డాక్టర్ కస్తూరి ప్రమీల, ఐఎంఏ డాక్టర్ నాగార్జున రెడ్డి, డాక్టర్ బింగి శ్రీనివాస్, డాక్టర్ దిడ్డి శ్రావణ్, ఇతర డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 24 గంటల పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఓపీ సేవలను బహిష్కరించారు.

### సంఘీభావం ప్రకటించిన ప్రదీప్ రావు..

మెడికో అత్యాచారం, హత్యకు నిరసగా వరంగల్ లోని ఎంజీఎం హాస్పిటల్ లో మెడికో విద్యార్థులు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ రావు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనపై చర్యలు తీసుకోకపోవడం అక్కడి ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. ప్రాణాలు పోసే వైద్యులకే రక్షణ లేని రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలన్నారు.

### బహిరంగంగా ఉరి తీయాలి..

**– కనుకుంట్ల రంజిత్ కుమార్,**
**బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు**



వైద్య విద్యార్థిని హత్యాచార నిందితులను బహిరంగంగా ఉరి తీయాలి. ఘటన జరిగి నాలుగు రోజులు కావస్తున్నా నిందితులపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు. ప్రాణాలు పోసే వైద్యులకు రక్షణ కల్పించలేని కలకత్తా ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా వైద్యులకు రక్షణ కల్పించాలి.

# రక్షా బంధన్ శుభాకాంక్షలు



పాఠకులకు,
ప్రకటన కర్తలకు,
ప్రజాప్రతినిధులకు,
నాయకులకు, అధికారులకు,
న్యాయవాదులకు,
వైద్యులకు, ఇంజనీర్లకు
విద్యార్థులకు,
ఉపాధ్యాయులకు,
వ్యాపారవేత్తలకు ప్రతి ఒక్కరి రాఖీ (రక్షా బంధన్) పండుగ శుభాకాంక్షలు. పర్వదినం సందర్భం సోమవారం కార్యాలయానికి సెలవు..
పున: ధర్శనం మంగళవారం..

---

## రక్షాబంధనం వేళ!

హృదయాంతరాలలోని దోబూచులాటలు ! అనుబంధాల తోడూనీడలు?
మమతలు పంచిన మధురానుభూతులు! హృదయ స్పందనల తీపి కబుర్లు!
బంధుత్వానికున్న పదునైన పునాదులు! మమతలు పంచే పరిమళాలు!
రాగద్వేషాలు లేని అనుబంధాల వెల్లువలు!
ఆత్మీయాలింగనాల అనుభూతులు ! స్నేహబంధానికి సమాంతరంగా..
అంతరాలు ఆంతర్యాలు కనిపించని రీతిలో
అక్కాచెల్లెళ్ల బంధనాలు! అన్నదమ్ముల ప్రేమాభిమానాలు!
భరోసానిచ్చే స్వాంతన వచనాలు! గుండెలోతుల్లోంచి జాలువారే ఓదార్పులు!
పలకరింపులు! నిట్టూర్పులు!! ఆకలిదప్పులెరుగని.మధుర క్షణాలు!
కలకాలం గుర్తుండే స్మృతి చిహ్నాలు!
ఈ రక్షాబంధనం పర్వదినం వేళ! సౌహార్ధతా అలంకరణమాల!
తోబుట్టువుల అనిర్వచనీయ బాంధవ్యాల హేళ!!



**పరాంకుశం**
**రఘు నారాయణ**
గ్రామం:తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా
సెల్ : 9949749987



# నగరంలో సినీ నటి కీర్తి సురేష్ సందడి

## జోస్ అలుక్కాస్ జ్యువలరీ మాల్ ప్రారంభం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని నక్కలగుట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన జోస్ అలుక్కాస్ జ్యువలరీ మాల్‌ని శనివారం సినీ నటి కీర్తి సురేష్ ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు. ఈ సందర్బంగా కీర్తి సురేష్ మాట్లాడుతూ తాను వరంగల్ నగరానికి రావడం సంతోషంగా ఉందన్నారు. జోస్ ఆలుక్కాస్ జ్యువలరీ మాల్ లో కొత్త వెరైటీ డిజైన్ లతో తయారు చేసిన జ్యువలరీలు అందుబాటులో ఉన్నాయన్నారు. డైమండ్స్ పైన 20శాతం, ప్లాటినంపై ఏడు శాతం డిస్కౌంట్ అభిస్తోందన్నారు. ఈ నెల 17 నుంచి 21 తేదీ వరకు రూ.60 వేల గోల్డ్, డైమండ్స్ కొనుగోలుపై ఫ్రీ గోల్డ్ కాయిన్ ఆఫర్ చేస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సినీ నటి కీర్తి సురేష్ ను చూడటానికి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## మామూనూర్ ఏసీపీ కార్యాలయంలో..

# సీపీ అంబర్ కిషోర్ ఝా తనిఖీ

### మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా 18న 4కె రన్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మామూనూర్ పోలీస్ డివిజనల్ కార్యాలయాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, ఏసీపీ తిరుపతి మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ డివిజనల్ కార్యాలయానికి సంబంధించిన రికార్డులను సీపీ పరిశీలించారు. ఏసీపీ దర్యాప్తు అధికారిగా ఉన్న పెండింగ్ కేసుల వివరాలు, నేరస్తుల అరెస్ట్, కేసుల దర్యాప్తు స్థితి గతులపై అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అధికారుల పనీతీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసుల ప్రతిష్టకు భంగం కలిగించే రీతిలో అధికారులు వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలు పోలీసులపై పెట్టుకున్న నమ్మకానికి తగ్గట్లుగా పనిచేయాలన్నారు. ముఖ్యంగా డయల్ 100 నుంచి వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు తక్షణమే స్పందించి త్వరితగతిన బాధితులకు సాయం అందించాలన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ కార్యాలయం ఆవరణలో పోలీస్ కమిషనర్ మొక్కలు నాటారు. ఈ తనిఖీల్లో మామూనూర్, గీసుగొండ, ఏనుమాముల ఇన్ స్పెక్టర్లు రవికుమార్, బాబులాల్, రాఘవేందర్, పర్వతగిరి సర్కిల్ ఇన్ స్పెక్టర్ రాజగోపాల్, సంగెం, పర్వతగిరి, ఐనవోలు ఎస్సైలు నరేష్, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### రేపు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా 4కె రన్

వరంగల్ పోలీసుల కమిషనరేట్ అధ్వర్యంలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా 18 వ తేది ఆదివారం ఉదయం 7గంటలకు నిర్వహించనున్న 4కె పరుగులో యువత, విద్యార్థులు ఉత్సహంగా పాల్గొనాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. వరంగల్ పోలీస్ పరెడ్ గ్రౌండ్ నుంచి ప్రారంభం కానున్న ఈ పరుగులో మొదటగా వచ్చిన ముగ్గురుకి రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున నగదు పురస్కారాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ పరుగులో జాతీయ స్థాయి క్రీడాకారులతో పాటు, తెలంగాణకు చెందిన ప్రముఖులు, కళాకారులు పాల్గొంటారని పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com